క్లుప్తంగా

పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో బీఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రతినిధులతో మాట్లాడి ఆలయ అభివృద్ధికి సహకారం అందజేస్తానని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు గుమ్మడి జంపాల్‌రెడ్డి, ఎల్లప్ప, నాగరాజు, మహేష్, శివ, శ్రీను, సిద్ధు, బాబు, శంకర్, వెంకటేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పుష్పాంజలి, కృష్ణ జనన శబ్దం, వినరో భాగ్యము, అన్నమాచార్య కీర్తనలు తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. ముఖ్య అతిథిగా యక్షగాన కంఠీరవ డాక్టర్ పసుమర్తి శేషుబాబు, పేసర్లపాటి శ్రీనివాస బంగారయ్య హాజరై కళాకారులను అభినందించారు.

రెడ్డి కాలనీ అధ్యక్షుడిగా రంగారెడ్డి


రెడ్డికాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ రెడ్డికాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో రంగారెడ్డి తన ప్రత్యర్థిపై 20 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా ప్రధాన కార్యదర్శిగా చెప్యాల సుదర్శన్‌రెడ్డి 34 ఓట్లతో విజయం సాధించారు. కోశాధికారిగా పి.తిరుపతిరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసులకు అందుబాటులో ఉంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం కాలనీవాసులు వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చెప్యాల సురేందర్ రెడ్డి, సీతారాంరెడ్డి, భూంరెడ్డి, రాఘవరెడ్డి, బుచ్చి రెడ్డి, నర్సిరెడ్డి, సంజీవ, ఐలయ్య, రవి గుప్తా, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలు



గౌతంనగర్: గోపాల్‌నగర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మొగిలయ్యకు నివాళి

కుషాయిగూడ: కుషాయిగూడ కూరగాయాల మార్కెట్ వ్యవస్థాపకుడు భూపతి మొగిలయ్య మృతి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మొగిలయ్య కుటుంబ సభ్యులను గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఓదార్చి నివాళులర్పించారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మార్కెట్ ఏర్పాటుతో ఎంతోమందికి ఉపాధి కల్పించిన గొప్ప వ్యక్తి మరణం బాధాకరం అన్నారు. మార్కెట్ ప్రతినిధులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు మొగిలయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గొల్లూరి అంజయ్య, సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సతీష్ రెడ్డి, బోదాసు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, యాకయ్య, బాలనరసింహ, ధనుంజయ్‌గౌడ్ పాల్గొన్నారు.


మొగిలయ్యకు నివాళులర్పిస్తున్న గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

మూడేళ్ల పాలనలో..

నువ్వెంతంటే.. నువ్వెంతంటూనే..!

పురపాలికల్లో పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లయినా అభివృద్ధి అంతంతే..

- అధ్వానంగా ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ
- రూ.లక్షల్లో పన్నులు.. ఆర్థిక సంఘం.. పట్టణ ప్రగతి నిధులొచ్చినా..
- ముందుకు సాగని అభివృద్ధి
- పట్టించుకోని అధికార గణం.. పట్టనట్లుగా పాలకవర్గం
- అక్రమ వసూళ్లు.. అంతర్గత విబేధాలతోనే సరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురసారథులకు రాజకీయాలపై ఉన్న మక్కువ.. పట్టణ ప్రగతిపై లేదు. దీంతో మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. పురపాలికల్లో పాలక వర్గం కొలువుదీరి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రేటర్ శివారు నగరాలు, పట్టణాల్లోని ప్రజల మౌలిక సదుపాయాలను పరిశీలిస్తే.. ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా ఉంది. ప్రజల నుంచి ముక్కు పిండి పన్నుల వసూలు చేయడంపై పెడుతున్న శ్రద్ధ.. సమస్యల పరిష్కారంలో చూపడం లేదని తెలుస్తోంది. విలీన గ్రామాలు, పట్టణాలతో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రధాన రోడ్లతో సహా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్న పాటి వర్షాలకే.. రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తే.. లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు జలమయంగా కావడంతో పాటు ప్రజలు నడవలేని స్థితికి చేరుతుండటంతో వారికి తిప్పలు తప్పడం లేదు.

☛ శివారు ప్రాంతాల్లో సమస్యలు...

శివారుల్లోని పెద్ద నగర పాలక సంస్థగా చెప్పుకునే.. బోడుప్పల్‌లో 1.50 లక్షల జనాభాతో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా ఏటా రూ.60 కోట్ల ఆదాయం వస్తోంది. ప్రజలు మాత్రం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, కాలుష్యం బారిన పడి చెరువు నీటి దుర్వాసన, నీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో 230.2 కిలో మీటర్ల మేర డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రైనేజీలు 35 కిలో మీటర్లు, వరద నీటి డ్రైనేజీలు ఏడు కిలోమీటర్ల వరకు ఉన్నాయి. 346.30 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, ఇందులో మట్టి రోడ్లు 36.5 కిలో మీటర్ల వరకు ఉన్నాయి.

☛ పీర్జాదిగూడలో...

మరో నగర పాలక సంస్థగా ఆవిర్భవించిన పీర్జాదిగూడలో లక్షకు పైగా జనాభాతో 80 కాలనీలు ఉండగా, ఏటా పన్నుల ద్వారా ఏటా రూ.30 కోట్ల ఆదాయం కార్పొరేషన్‌కు సమకూరినా.. ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 215 కిలో మీటర్ల డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రైనేజీలు 32 కిలో మీటర్లు, 240 కిలో మీటర్ల రోడ్లు ఉండగా, ఇందులో మట్టి రోడ్లు 9 కిలో మీటర్ల వరకు ఉన్నాయి. ఈ పట్టణాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తే చాలు.. రోడ్లలన్నీ నరకానికి నకళ్లుగా.. వరద, మురికి నీటితో ప్రజలను తీవ్ర ఇబ్బంది పాలుజేస్తున్నాయి. అతి పెద్ద జనాభా కలిగిన జవహర్ నగర్ నగరపాలక సంస్థలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇంతా..అంతా కాదు. ఈ మూడు నగర పాలక సంస్థలకు మాత్రమే సమస్యలు పరిమితం కాలేదు. ఇలాంటి అధ్వాన్న పరిస్థితులను ఎదుర్కొంటున్న పురపాలక సంఘాలు నగర శివారు పరిధిలో మరో 3 నగర పాలక సంస్థలు, 23 మున్సిపాలిటీల్లో కూడా నెలకొని ఉండటంతో ఇక్కడి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

> **పాలకుల మధ్య బేధాభిప్రాయాలు...**
>
> పురసారథుల పదవీ కాలం మూడేళ్లు పూర్తి కావడంతో పలు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పాలకుల మధ్య బేదాభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పాలక వర్గంలో అసంతృప్తులు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. తాజాగా శనివారం జిల్లా కలెక్టర్‌కు జవహర్‌నగర్ నగరపాలక సంస్థకు చెందిన 20 మంది కార్పొరేటర్లు మేయర్ కావ్యకు అవిశ్వాసంపై నోటీసు ఇవ్వగా, మేడ్చల్‌లో కౌన్సిల్ సభ్యులు చైర్మన్ మార్పుపై రాజీనామాకు సిద్ధపడుతూ.. జిల్లా మంత్రి మల్లారెడ్డికి ఈ నెల 30 వరకు డెట్ లైన్ విధించారు.

☛ శివారుల్లో పట్టణాలివే...

నగర శివారుల్లో బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్ బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉండగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగ్, ఆదిభట్ల, ఆమనగల్లు, కొత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ పట్టణాల్లో ముక్కు పిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ.343 కోట్లు వసూలు చేస్తున్నా.. పురపాలికలు ప్రజలకు మాత్రం సేవలు అందించటంలో విఫలమవుతున్నారన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు.

☛ కోట్లల్లో పన్నులు.. ఇతర వనరులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ.175 కోట్లు వస్తుండగా.. రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ.168 కోట్లు వసూలవుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతిలోనూ పురపాలక సంఘాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులన్నింటిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో.. అభివృద్ధి అంతంత మాత్రంగా సాగుతోంది.

☛ రాజకీయాలు.. అంతర్గత విబేధాలు..

పురపాలికల్లో అభివృద్ధిపై శ్రద్ధ చూపని పాలక వర్గం సభ్యులు మూడేళ్ల కాలంలో అంతర్గత వివాదాలు, అందినకాడికి దండుకోవడంపై ఎక్కువ దృష్టి సారించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ డివిజన్/వార్డు పరిధిలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్టుమెంట్లు, లేఅవుట్లపై ప్రత్యేక దృష్టితో అనుచరులు, టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొంత మంది సిబ్బందితో ప్రతీ దానికి ఒక రేటు ఫిక్స్ చేసి వసూలు చేపట్టినట్లు విమర్శలు ఉన్నాయి. పురపాలికల్లో అభివృద్ధి కార్యక్రమాలపై కాకుండా అక్రమ వసూళ్లపై పోటాపోటీగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే మెజారిటీ పురపాలికల్లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై అక్రమ వసూళ్లకు తెర లేపడంతో పాటు నియోజకవర్గం స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధికి కూడా నెల నెలా అక్రమ వసూళ్లలో వాటాను అందిస్తున్నట్లు తెలుస్తోంది.

జమ్మిగడ్డలో జ్ఞానభారతి


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న స్థానికులు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో జ్ఞానభారతి కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజలు అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలని పేర్కొన్నారు. స్థానికులు గగన్‌కుమార్, రహీం, గిరి, నగేష్, చిన్నారావు, దయానందర్, వినయ్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ అదుర్స్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఎగ్జిబిషన్లు దోహదపడతాయని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో నుమాయిష్ పేరుతో నిర్వహించిన వస్తు ప్రదర్శన ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తయారు చేసిన గాజులు, చెవి రింగులు, పెన్స్ స్టాండ్స్, మినీ కూలర్స్, టార్చ్ లైట్స్, తిను బండరాలు, గిఫ్ట్ బ్యాగ్స్ తదితర వాటిని ప్రదర్శించారన్నారు. పాఠశాల డైరెక్టర్లు అనిల్ అయ్యంగార్, సౌజన్య రెడ్డి, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతంగా జీవించాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ చీరాల నర్సింహ

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ అన్నారు. పెంటారెడ్డికాలనీ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ చీరాల నర్సింహ, తపాడియా డయాగ్నస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. షుగర్, మూత్ర, రక్త, థైరాయిడ్, ఇతర జనరల్ పరీక్షలు నిర్వహించారు. పెంటారెడ్డి కాలనీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనకయ్య కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం అల్వాల్ అంజనాపురిలో నివసించే జగన్‌సాయిశివ(30) కోఠిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు. ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయని, దీంతో అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమాజంలో లయన్స్ క్లబ్‌కు ప్రత్యేక గుర్తింపు


ఉత్తమ అవార్డు అందుకున్న గోపాల్‌రెడ్డి

మల్కాజిగిరి: లయన్స్ క్లబ్స్ పట్ల ప్రజల్లో గౌరవం ఉందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ కల్పవల్లి అన్నారు. మల్కాజిగిరి శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో శాస్త్రి రీజనల్ సమావేశం రీజియన్ చైర్‌పర్సన్ ఉప్పల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి లయన్స్ క్లబ్స్ గుర్తింపు తెచ్చుకున్నాయన్నారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆ కోణంలో సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డికి మెమెంటో అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు లింగారెడ్డి, రవీంద్రనాథ్‌గుప్తా, ప్రసాద్, కామేశ్వరి, సురేష్, సురేందర్‌రెడ్డి, రెడ్డప్పరెడ్డి, షకీల్ అహ్మద్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, సాంబశివరావు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో సంక్రాంతి మిలన్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: భావసారత్ క్షత్రియ సమాజ్ హైదరాబాద్ నార్త్ ఆధ్వర్యంలో కాప్రా డివిజన్ దుర్గానగర్‌లో సంక్రాంతి మిలన్, హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ఆదివారం ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్థానికులకు వైద్య పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు కిషోర్, కిషన్‌రావు, భూపే, సుశీలభాయ్, సాయిబాబు, మహేంద్రకర్, నర్సింగరావు, జ్యోతి, సునీత, నవనీత, బీఆర్ఎస్ నాయకులు గడ్డం రవికుమార్, సూడుగు మహేందర్‌రెడ్డి, గిల్‌బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తా


తాగునీటి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: డివిజన్‌లో తాగునీటి సమస్యలపై ఆదివారం కార్పొరేటర్ ప్రభుదాస్ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలోని ఇందిరానగర్, మంగాపురం, కృష్ణానగర్, కైలాసగిరి, నవోదయనగర్ కాలనీల్లో పర్యటించిన ఆయన ఆయా కాలనీల్లో నెలకొన్న తాగునీటి, లోప్రెషర్, లీకేజీలు వంటి సమస్యలను గుర్తించి అధికారులతో చర్చించారు. వారం రోజుల్లో కొత్త పైప్‌లైన్ పనులు చేపట్టి తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, జలమండలి మేనేజర్ వేణుగోపాల్, శ్రీను, లింగమూర్తి, ఆయా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


కుషాయిగూడలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. కుషాయిగూడ శిశుమందిర్‌లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహపూరిత వాతావరణంలో పోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. యువకుల్లో ఉత్తేజం నింపేందుకు క్రీడాపోటీలు నిర్వహించడంపై బజరంగ్‌దళ్ నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు శ్రీకాంత్, చల్లా ప్రభాకర్, సుమంత్, రాజేష్, బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు నాదం, కాసుల సురేందర్‌గౌడ్, నర్సింగ్‌రావు, తాళ్ల ఆనంద్‌గౌడ్, ఎజాజ్, నాగమణి, చంద్రకళ, రమాదేవి, సబిత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి


పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు

మౌలాలి: మౌలాలి డివిజన్ కమాన్ వద్ద పైపులైన్ మరమ్మతులను ఆదివారం మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, బాక్రీ అలీ, సదానంద్‌గౌడ్, అనిపెద్ది సాయిబాబా, శివకుమార్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, కిరణ్, ఫాతిమాబేగం, రాము, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌కు సహకరిస్తా


మాజీ ఉపకులపతి విద్యావతి, కుటుంబ సభ్యులను సత్కరిస్తూ..


మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని కాకతీయ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి విద్యావతి అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఉపకులపతి విద్యావతి హాజరయ్యారు. అసోసియేషన్‌కు సహకరించిన దాతలు, సభ్యులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంపీ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, కార్యదర్శి సీఎస్ రావు, అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, డైరెక్టర్స్ పాండు రంగంగౌడ్, కోశాధికారి జి.శ్రీశైలంగౌడ్, రాగిరి మోహన్ రెడ్డి, రామకృష్ణ, జంగయ్యగౌడ్, యాదగిరి యాదవ్, యాదయ్య, ఎంవీ రాంచంద్రమూర్తి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ, ప్రమోషన్లలో పారదర్శకత ఉండాలి


పరిశీలన కేంద్రంలో పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

మల్కాజిగిరి: ఉపాధ్యాయుల బదిలీ, ప్రమోషన్లలో ఎలాంటి విమర్శలు రాకూడదని, పారదర్శకత పాటించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సూచించారు. మల్కాజిగిరిలోని మండల విద్యాధికారి కార్యాలయంలో జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల సర్వీస్ పరిశీలన కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రమోషన్లకు అర్హులైన వారి సర్వీసు రికార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి రోస్టర్ లిస్ట్ సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో బదిలీలు, ప్రమోషన్లకు అర్హులైన సుమారు 648 మంది ఉపాధ్యాయులు రికార్డుల పరిశీలనలో పాల్గొన్నారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో విజయకుమారి, ఏడీ లింగానందం, ఎంఈవో శశిధర్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని చిన్న చెరువు గ్రౌండ్‌లోని పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై ఛత్రపతి శివాజీ మహారాజ్ యువ జాగృతి సమితి కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సంక్రాంతి సమ్మేళనంలో పాల్గొన్నారు. పాండురంగస్వామి దేవాలయ సమితి అధ్యక్షుడు సుభాష్ పాటిల్, ఏక్‌నాథ్, శివాజీ, సునీల్, పాండురంగ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మల్కాజిగిరి: సీతారాంనగర్‌కు చెందిన పురోహితుడు నాగరాజశర్మ(56) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని పరామర్శించిన స్థానిక కార్పొరేటర్ సానుభూతి తెలియజేసి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

శ్రీకృష్ణానగర్‌లో సమస్యలు పరిష్కరిస్తా


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: శ్రీకృష్ణానగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. కాలనీలో ఆదివారం పర్యటించిన కార్పొరేటర్ స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు తక్కువ ప్రెషర్‌తో వస్తోందని, దీంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. సమస్య పరిష్కారానికి మార్గాలను పరిశీలించాలని జలమండలి మేనేజర్ నవీన్‌కు సూచించారు. కొన్ని చోట్ల విద్యుత్ తీగలు దగ్గరగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పడంతో ఏఈ కళ్యాణితో మాట్లాడి స్పేసర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సునీల్, వినయ్, శరత్, మురళి, మూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.